ప్రజాశక్తి
గురువారం 23 నవంబర్ 2023



ఎసిబి వలలో బుక్కపట్నం సబ్‌రిజిస్ట్రార్

రూ.10వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ అధికారి


సబ్‌రిజిస్ట్రార్‌ను విచారిస్తున్న ఎసిబి అధికారులు

ప్రజాశక్తి-బుక్కపట్నం

బుక్కపట్నం సబ్ రిజిస్టర్ కార్యాలయంపై బుధవారం సాయంత్రం ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడి చేశారు. ఓ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో సబ్ రిజిస్ట్రార్ శీనానాయక్ లంచం తీసుకుంటూ ఉండగా ఆయన్ను పట్టుకుని, అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి తెలిపిన వివరాల మేరకు... పుట్టపర్తి మండలంకు చెందిన లింగాల సురేందర్ రెడ్డి అనే వ్యక్తికి సంబంధించి అన్నదమ్ముల విభాగ దస్తావేజుల కోసం సబ్‌రిజిస్ట్రార్‌ను ఈ ఏడాది మార్చి నెలలో సంప్రదించాడు. అప్పట్లో ఇందుకోసం లంచం ఇవ్వాలంటూ డాక్యుమెంట్ రైటర్ శ్రీహరి ద్వారా సబ్‌రిజిస్ట్రార్ డిమాండ్ చేశారు. ఈనెల 16వ తేదీన శ్రీహరి ద్వారా 50వేల రూపాయలు లంచం రూపంగా ఇస్తే రిజిస్ట్రేషన్ చేస్తానని చెప్పాడు. ఈ విషయంపై లింగాల సురేందర్ రెడ్డి మంగళవారం నాడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనల మేరకు బుధవారం సాయంత్రం రూ.10 వేలను డాక్యుమెంటరీ శ్రీహరికి ఇచ్చేలా ఎసిబి అధికారులు సూచించారు. ఈ మేరకు శ్రీహరి చేతికి రూ.10 వేలను సురేంధర్‌రెడ్డి ఇస్తుండగా అక్కడే ఉన్న ఎసిబి అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. శ్రీహరిని విచారించగా సబ్ రిజిస్ట్రార్ శీనానాయక్ పేరును చెప్పారు. దీంతో సబ్‌రిజిస్ట్రార్ శీనానాయక్‌ను ఎసిబి అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తు న్నారు. ఈ దాడుల్లో ఏసీబీ సిఐలు శాంతిలాల్, శివ గంగాధర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పారిపోయిన సబ్‌రిజిస్ట్రార్

ఎసిబి అధికారులు విచారణ జరుపుతుండగా సబ్‌రిజిస్ట్రార్ శీనానాయక్ అధికారుల కళ్లుగప్పి పారిపోయాడు. సాయంత్రం కార్యాలయంలో విచారణ జరుపుతున్న సమయంలో బాత్‌రూంకు వెళ్లోస్తానని అనుమతి తీసుకుని బయటకు వెళ్లాడు. వెళ్లిన వ్యక్తి అటునుంచి అటే పారిపోయాడు. ఆయన పారిపోయినట్లు గుర్తించిన ఎసిబి అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు.

సంబరంగా 'సత్యసాయి' స్నాతకోత్సవం





బంగారు పతకాలు, పట్టాలు సాధించిన విద్యార్థులతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ అబ్దుల్ నజీర్, మంత్రి ఉషశ్రీ

- ముఖ్య అతిథిగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరు
- 21 మందికి బంగారు పతకాలు
- 500 మందికి డిగ్రీ, పీజీ పట్టాలు ప్రదానం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, పుట్టపర్తి అర్బన్

శ్రీ సత్యసాయి డీమ్డ్ యూనివర్శిటీ 42వ స్నాతకోత్సవ వేడుకలు బుధవారం నాడు సంబరంగా జరిగాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరవగా, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అతిథిగా హాజరయ్యారు. ఇద్దరు ప్రముఖులు రావడంతో పుట్టపర్తిలో సందడి వాతావరణం నెలకొంది. సత్యసాయిబాబా జయంతికి ఒక రోజు ముందు స్నాతకోత్సవం జరగడం అనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా గురువారం నాడు 98వ జయంతి వేడుకలు జరగనున్నాయి. ఈ సందర్భంగా బుధవారం నాడు విశ్వవిద్యాలయం స్నాతకోత్సవ వేడుకలు జరిగాయి. సాయిహీరా గ్లోబల్ కన్వెన్షన్ హాలులో జరిగిన ఈ వేడుకలు ఎంతో క్రమశిక్షణతో సాగాయి. ప్రారంభోత్సవానికి ముందు విద్యార్థులు వాయించిన బ్యాండ్ అందరినీ ఆకట్టుకుంది. అనంతరం స్నాతకోత్సవాన్ని ఛాన్సలర్ కృష్ణమాచారి చక్రవర్తి ప్రారంభించారు. విశ్వవిద్యాలయంలో కొనసాగుతున్న కార్యకలాపాల గురించి వైస్ ఛాన్సలరు రాఘవేంద్ర ప్రసాద్ వివరించారు.


రాష్ట్రపతి ద్రౌపది ముర్ము


గవర్నర్ అబ్దుల్ నజీర్

సత్యసాయి సేవలు అభినందనీయం : రాష్ట్రపతి

ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగానున్న పుట్టపర్తిలో సమగ్రమైన విద్యను సత్యసాయి ట్రస్టు ద్వారా అందిస్తుండటం అభినందనీయమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. 'సత్యం వద... ధర్మం చర' అన్న నినాదాన్ని సత్యసాయిబాబా ప్రకటించినట్టుగానే... ప్రతి ఒక్కరూ సత్యాన్ని పాటించి, ధర్మాన్ని ఆచరించాలని సూచించారు. మహాత్మాగాంధీ కూడా సత్యశోధన ప్రాధాన్యతను ఎప్పుడూ చెప్పేవారని గుర్తు చేశారు. ఉన్నతమైన విద్యా విజ్ఞానాన్ని అందించేదే కాకుండా సమాజ పునర్ నిర్మాణంలో ఎంతో కీలకమని చెప్పారు. నైతిక విలువలు, జీవన విలువలను విద్య అందిస్తుందన్నారు. బాబా బోధించిన మాన వతా విలువలు ఆధ్యాత్మికత కలగలిపి ఆధునిక విజ్ఞానాన్ని అందించేందుకు చక్కటి విద్యాసంస్థలను పుట్టపర్తిలో నెలకొల్పా లన్నారు. మానవతా విలువలు ఆధ్యాత్మికత శాస్త్ర సాంకేతిక అంశాలతో కూడిన సమ్మిళిత విద్యను బోధిస్తూ అద్భుతమైన ఫలితాలతో ప్రపంచంలోనే మేటి విద్యాసంస్థల సరసన సత్యసాయి విద్యా సంస్థలు విలువలకు నిలయాలుగా నిలిచాయన్నారు. సత్యసాయి ప్రజలకు వైద్య, విద్య, మంచినీరు వంటి ఎన్నో సేవలు అందించారన్నారు. భగవాన్ సత్యసాయిబాబా సేవలను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు వారి అడుగుజాడలలో నడవాలని సూచించారు. ఈ ప్రాంతాన్ని సందర్శించి, బాబా మహాసమాధిని సందర్శించుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు.

ప్రాచీన గురుకుల విద్య తరహాలో ఇక్కడి విద్య : గవర్నర్

రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ మన ప్రాచీన ఆధ్యాత్మిక సంపద ఎంతో విలువైనదని చెప్పారు. ప్రాచీన గురుకుల విద్య తరహాలోనే సత్యసాయి విద్యా సంస్థల్లోనూ విద్యను అందించడం ముదావాహ మన్నారు. లోక సమస్త సుఖీనోభవంతు' అని వేదాల్లో చెప్పినట్టుగా మన ప్రాచీనపరంపర శాంతి, సౌభ్రాతృ త్వాలను కోరుకుంటుందని పేర్కొన్నారు. 'విద్యా దదాతి వినయం... వినయాద్యాతి పాత్రతాం' అని చెప్పినట్టుగా విద్య ద్వారా వినయం.. వినయం ద్వారా అర్హత.. అర్హత ద్వారా సంపద అన్నీ వస్తాయని పేర్కొన్నారు. సమగ్రమైన విద్యను పొందడం ద్వారా విజ్ఞానం పొందడమే కాకుండా సమాజాభివృద్ధికి తోడ్పడినవార మవుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్, సెంట్రల్ ట్రస్టు సభ్యులు ఎస్.నాగానంద్ పాల్గొన్నారు.

500 మందికి డిగ్రీలు ప్రదానం

42వ స్నాతకోత్సవం సందర్భంగా 14 మందికి పిహెచ్‌డిలు, 500 మందికి డిగ్రీలు, పీజీ పట్టాలను ప్రదానం చేశారు. వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 21 మందికి బంగారు పతకాలను రాష్ట్రపతి చేతుల మీదుగా అందించారు.


ప్రతిభకనబరిచిన విద్యార్థికి బంగారుపతకం వేస్తున్న రాష్ట్రపతి

రాష్ట్రపతికి ఘన స్వాగతం


ఎయిర్‌పోర్టులో రాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న మంత్రి ఉష శ్రీచరణ్

పుట్టపర్తి రూరల్: శ్రీసత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు వచ్చిన భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకు శ్రీసత్యసాయి విమానాశ్రయంలో బుధవారం మధ్యాహ్నం ఘన స్వాగతం లభించింది. ఒడిశాలోని జహర్సుగూడ విమానాశ్రయం నుంచి బయలుదేరిన రాష్ట్రపతి మధ్యాహ్నం 2-47.గంటలకు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్నారు .రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, రాష్ట్ర స్త్రీ శివు సంక్షేమ శాఖ మంత్రి ఉషాశ్రీచరణ్ , ఉమ్మడి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్, బోయ గిరిజమ్మ, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్, అడిషనల్ డిజిపి లాఅండ్‌ఆర్డర్ విజయవాడ డాIIశంఖబ్రరత బగ్చి, పుట్టపర్తి జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు, ఎస్పీ మాధవరెడ్డి, హిందూపురం పార్లమెంట్ సభ్యులు గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీలు షేక్ మొహమ్మద్ ఇక్బాల్, ఎస్.మంగమ్మ, భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి, ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, డాII.ఎం.తిప్పేస్వామి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, పుట్టపర్తి మున్సిపల్ ఛైర్మన్ తుంగ ఓబులపతి తదితరులు రాష్ట్రపతికి పుష్పగుచ్చాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో జరిగే స్నాతకోత్సవంలో రాష్ట్రపతి పాల్గొన్నారు.

మరోమారు తెరపైకి 'ఎంపిపి' వ్యవహారం

దుమారం రేపిన ఎమ్మెల్సీ వ్యాఖ్యలు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇక్బాల్

ప్రజాశక్తి - చిలమత్తూరు

చిలమత్తూరు ఎంపిపి మార్పు వ్యవహారం మరోమారు తెరపైకి వచ్చింది. ఈ విషయంలో ఎమ్మెల్సీ ఇక్బాల్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఎంపిటిసి ఎన్నికల అనంతరం ఎంపిపి ఎన్నిక సమయంలో చేసిన నిర్ణయం మేరకు చిలమత్తూరు ఎంపిపిగా ఉన్న వ్యక్తి దిగిపోయి మరొకరికి అవకాశం కల్పించాలని అందుకు అనుగుణంగా ప్రస్తుత ఇన్‌ఛార్జి దీపిక నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్సీ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఏ వర్గాలు లేవు అంటూనే మరో సారి వర్గపోరుకు తెరలేపారంటూ మండలంలో జోరుగా చర్చ సాగుతుంది. పుట్టపర్తిలో జరిగిన స్నాతకోత్సవానికి వచ్చిన ఇక్బాల్ స్థానిక మాజీ మండల కన్వీనర్ రాజారెడ్డి స్వగృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆసక్తికర వాఖ్యలు చేశారు. తాను ఇన్‌ఛార్జిగా ఉన్నప్పుడు కొన్ని నిర్ణయాలు, నిబంధనలు మేరకు ఎంపిపి ఎన్నిక జరిగిందని ఆ మేరకు ప్రస్తుతం చిలమత్తూరు ఎంపిపి గా ఉన్న పురుషోత్తమరెడ్డి అంగీకరించారని, రాయలసీమ కోఆర్డినేటర్ మంత్రి పెద్దిరెడ్డిరామచంద్రరెడ్డి కూడా ఒప్పుకున్నారని అన్నారు. ఈ మేరకు ఎంపిపి టర్మ్ ముగిసిందని ఆ తర్వాత మిగిలిన ఎంపిటిసిలు జగన్ మోహన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి కి అవకాశం ఇవ్వాలని అన్నారు. ధర్మవరంలో కూడా ఎంపిపి విషయంలో చేసుకున్న నిర్ణయం మేరకు టర్మ్ ముగియగానే వారు స్వచ్ఛందంగా తప్పుకున్నారని దీంతో మరొకరిని ఎంపిక చేశారని గుర్తు చేశారు. పక్కన ఉన్న వారిని మభ్య పెట్టి ఎలా ఇబ్బందులకు గురిచేశారో బెదిరింపులకు గురిచేశారో అందరికి తెలుసని అన్నారు. బెదిరింపులకు గురిచేసి,ప్రలోభాలకి గురిచేస్తే ఎవరు పక్కన ఉండరని ప్రేమ అభిమానం అనురాగాలతో అందరిని దగ్గర చేసుకోవాలని హితవు పలికారు. ఏది ఏమైన హిందూపురం నియోజక వర్గంలో వైసిపిలో వర్గాలకు చెక్ పడిందని భావించిన తరుణంలో మళ్లీ పాత తరహాలో వర్గాలు కొనసాగుతున్నాయన్న సంకేతాలు బలపడ్డాయి. ఈ నేపథ్యంలో పార్టీ నేతల్లో ఏ ప్రజా ప్రతినిధి, ఏ నాయకుడు ఎటువైపో అన్న గుబులు కార్యకర్తలో మొదలైంది.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..? : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి కదిరి అర్బన్

కదిరి నియోజకవర్గంలో వైసిపి హయాంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని దీనిపై చర్చకు సిద్ధమా అని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ స్థానిక ఎమ్మెల్యే సిద్ధారెడ్డికి సవాల్ విసిరారు. ఈ మేరకు ఆయన బుధవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసిపి అధిష్టానం, నాయకులు ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. టిడిపి హయాంలో జరిగిన అభివృద్ధి తమ హయాంలో జరిగినట్లు ఎమ్మెల్యే గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. అందుక సంబందించిన సాక్ష్యాలను ఆయన ఈసందర్భంగా చూపెట్టారు. టిడిపి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని తామే చేశామని భుజాలు ఎగిరేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో నాయకులుడైమండ్ ఇర్ఫాన్, నాయకులు గంగరాజు, ఉత్తన్న కార్యకర్తలు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కందికుంట

రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ధర్మవరం క్రీడాకారులు


ప్రతిభా విద్యార్థులతో ధర్మాంబ బాస్కెట్ బాల్ అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

నవంబర్ 24 నుండి నవంబర్ 26వ తేదీ వరకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం పట్టణంలో జరిగే అండర్ 17 ఆంధ్రప్రదేశ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్కూల్ గేమ్స్ బాస్కెట్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలకు జిల్లానుంచి ధర్మవరం పట్టణానికి చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారు. బాలికల విభాగంలో కిరణ్మయి, సల్మా,నీఖ్య ,బాలుర విభాగంలో విజయ్, లక్ష్మీనారాయణ ఎంపికైనట్లు ధర్మాంబ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ , ఆత్మీయ ట్రస్ట్ ఛైర్మన్ శెట్టిపి జయచంద్రా రెడ్డి తెలిపారు. అక్టోబర్ 21వ తేదీ తేదీన అనంతపురం జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కాలేజ్ క్రీడా మైదానం జరిగిన సెలక్షన్స్‌లో వీరు ప్రతిభ చూపడంతో జిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నారు. వీరి ఎంపిక పట్ల ధర్మాంబ బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు మేడాపురం రామిరెడ్డి, సెక్రెటరీ వాయాల్పాడు హిదయతుల్లా, కోచ్ సంజయ్, అసోసియేషన్ సభ్యులు , ఆత్మీయ ట్రస్ట్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

బాబురెడ్డి ఎవరు..?

దందాలు...దౌర్జన్యాలు చేస్తే సహించేది లేదు

ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్

ప్రజాశక్తి-హిందూపురం

పార్టీని అడ్డం పెట్టుకుని నియోజకవర్గంలో దందాలు...దౌర్జన్యాలు చేస్తే సహించేది లేదని ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ఎమ్మెల్సీ ఇక్బాల్ బుధవారం రాత్రి హిందూపురానికి వచ్చారు. వైసిపి నాయకులు ఉదయ్‌కుమార్ ఆరోగ్య పరిస్థితి బాగాలేదని తెలిసి అతని ఇంటికి వెళ్లి పరామర్శించారు. అక్కడి నుంచి మాజీ సమన్వయ కర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి ఇంటికి వెళ్లారు. అక్కడ విలేకరుల సమావేశంలో పరోక్షంగా ప్రస్తుత సమన్వయ కర్త దీపిక వేణురెడ్డి వర్గంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూపురం నియోజక వర్గంలో గతంలో లోకల్ నాన్ లోకల్ అంటు కొంత మంది నాయకులు అప్పట్లో అన్నారని అయితే ఇప్పుడు ఉన్నా బాబురెడ్డి ఎవరు...ఇతనికి హిందూపురంలో పని ఏముంది.. ఎవరు అతను... ఇక్కడ నాయకులను, అధికారులను ఎందుకు బెదరిస్తున్నారు అని ప్రశ్నించారు. ఇలాంటివి తగదని, మానుకోకపోతే బాగుండదని హెచ్చరించారు. పార్టీలోని నాయకులందిరిని దూరం చేసుకుంటే గెలుపు ఏలా సాధ్యం అని ప్రశ్నించారు. చిలమత్తూరు ఎంపిపి పురుషోత్తంరెడ్డి వెంటనే పదవి నుంచి వైదొలగి ఒప్పందం ప్రకారం మరొకరికి అవకాశం ఇవ్వాలని కోరారు. ఒప్పందం ప్రకారం ధర్మవరంలో పదవీ మార్పులు జరిగితే ఇక్కడ ఎందుకు జగరడం లేదని ప్రశ్నించారు. సమన్వయకర్త వర్గంలో తిరిగితే పదవీ మార్పులు జరగవా అని నిలదీశారు. ఇక్కడ అధికారులను బెదరిస్తూ జనంపై దౌర్జన్యాలు చేస్తున్నారని ఇలాంటివి తగదని సూచించారు. అన్ని అంశాలను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానన్నారు. తనపై అభిమానంతో కలవడానికి వస్తే తోకలు కత్తిరిస్తామంటు బెదరింపులకు దిగడం ఎంత వరకు సమంజసం అని అన్నారు. తాను వైసిపిలోనే ఉన్నానని, ఇక్కడ నాలుగు సంవత్సరాలు పని చేసినందుకు ఎంతో అభిమానంతో నాయకులు, కార్యకర్తలు వస్తే వారిని ఇలా బెదరింపులకు పాల్పడటం తగదని అన్నారు. తఅనంతరం మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ ఇంటికి వెళ్లారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

నాటి కుగ్రామం.. నేటి జిల్లా కేంద్రం..!


- సత్యసాయి కేంద్రంగా పుట్టపర్తికి ప్రపంచస్థాయి గుర్తింపు
- బస్సులేని ప్రాంతానికి విమానాలు
- పర్యాటకంగానూ అభివృద్ధి
- నేడు సత్యసాయి 98వ జయంతి వేడుకలు
- ముస్తాబైన పుట్టపర్తి


పుట్టపర్తి ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఒకనాటి కుగ్రామమైన పుట్టపర్తి నేడు జిల్లా కేంద్రంగా రూపాంతరం చెందింది. స్వాతంత్రం వచ్చిన 15 ఏళ్లకు పుట్టపర్తి గ్రామానికి విద్యుత్ సౌకర్యం ఏర్పడింది. అప్పట్లో పెంకుటిళ్లు, పూరిళ్లలో ఇక్కడి ప్రజలు నివసించేవారు. శ్రీసత్యసాయి బాబా పుట్టపర్తికి రావడంతో ఈ ప్రాంతం స్వరూపమే మారిపోయింది. ఒకప్పుడు బస్సే లేని ఈ గ్రామానికి నేడు విమానాలు వస్తున్నాయంటే ఈ ప్రాంతం ఎలా మారిపోయిందో అర్థం చేసుకోవచ్చు. సత్యసాయి ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్ నుంచి అన్ని నగరాలకూ రైల్వే సౌకర్యం ఏర్పడింది. కుగ్రామమైన పుట్టపర్తి నేడు అంచలంచెలుగా ఎదిగి సత్యసాయి జిల్లా కేంద్రంగా ఏర్పడింది. పుట్టపర్తి జిల్లా కేంద్రం చేయడం ద్వారా ఈ ప్రాంతం మరింత అభివద్ధి చెందే అవకాశాలు ఏర్పడ్డాయి. జిల్లాకేంద్రంగా ఏర్పడిన తరువాత ప్రభుత్వ కార్యాలయాలకు ఇబ్బంది లేకుండా సత్యసాయి ట్రస్టు వారి ఆధీనంలో ఉన్న భవనాలను కార్యాలయాల కోసం అప్పగించింది. దీంతో కొత్త జిల్లా అయినప్పటికీ ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పాలన పరంగా అధికారులకు విధుల నిర్వహణ సులభతరం అయింది.

నేడు బాబా జయంతి ఉత్సవాలు



శ్రీసత్యసాయిబాబా 98వ జయంతి వేడుకలు గురువారం నాడు ప్రశాంతి నిలయంలో వైభవంగా జరగనున్నాయి. వేడుకల నిర్వహణ ఏర్పాట్లను ఇప్పటికే సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ఆధ్వర్యంలో పూర్తి చేశారు. వేడుకల్లో పాల్గొనడానికి దేశ విదేశీ భక్తులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో ఇప్పటికే పుట్టపర్తికి చేరుకున్నారు. పుట్టపర్తి మొత్తం ప్రత్యేక అలంకరణతో ముస్తాబు అయ్యింది. ప్రతి ఏడాది సత్యసాయి జయంతి ఉత్సవాలను ట్రస్టు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగానే గురువారం నాడు ఈ వేడుకలు జరగనున్నాయి.

బాబా రాకతో మారిన పుట్టపర్తి రూపరేఖలు

1925 నవంబర్ 23న పుట్టపర్తిలో పెద్ద వెంకమ్మ రాజు, ఈశ్వరమ్మ దంపతులకు సత్యనారాయణ రాజు జన్మించారు. తన 15 ఏట సత్యనారాయణ రాజు తాను సత్యసాయిబాబా అని ప్రకటించుకున్నారు. అప్పట్లో చిన్న గుడిలా ఉన్న ఆయన నివాసం సత్య సాయిబాబాగా అవతరించిన తరువాత ప్రశాంతి నిలయంగా మారింది. ఇక్కడకు దేశ విదేశాలకు చెందిన పర్యాటకులు, భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. దాదాపు 180 దేశాల్లో సత్యసాయి సేవా సమితులు ఏర్పడ్డాయి. సత్యసాయి ట్రస్టును ఏర్పాటు చేసి పలుసేవా కార్యక్రమాలను చేపట్టారు. కరువు జిల్లా అయిన అనంతపురంలో తాగునీటి కోసం దాదాపు రూ.400 కోట్లు వెచ్చించి 1100 గ్రామాలకు తాగునీరు అందించిన ఘనత సత్యసాయికి దక్కుతుంది. ఈ జిల్లాలోనే కాక రాష్ట్రంలోని మరో ఎనిమిది జిల్లాలకు సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో తాగునీరు అందించారు. ప్రకతి వైపరీత్యాలు ఏర్పడినప్పుడు సత్యసాయి సేవాసమితిల ఆధ్వర్యంలో సేవాదళ్ ఆ ప్రాంతాలకు వెళ్లి సేవా కార్యక్రమాలు చేపట్టేవారు. బాబా మరణానంతరం ట్రస్టు ఆధ్వర్యంలో అలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయి. బాబా తన తల్లి కోరిక మేరకు విద్య, వైద్యం సదుపాయాలను విస్తరించారు. ప్రధానంగా పుట్టపర్తిలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఏర్పాటు చేసి ప్రపంచంలోనే అత్యంత అధునాత వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చారు. ఈ ఆస్పత్రిలో గుండె, కన్ను, ఆర్థోపెడిక్, తదితర రోగాలకు పూర్తిగా ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. పుట్టపర్తిలోని జనరల్ ఆసుపత్రిని నెలకొల్పి ఇక్కడా ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నారు. విద్యాభివృద్ధిలో భాగంగా పట్టపర్తిలో పలు విద్యాసంస్థలనూ ఏర్పాటు చేశారు. పుట్టపర్తితో పాటు అనంతపురం, కర్నాటక రాష్ట్రంలోని బందావన్‌లో కూడా సత్యసాయి విద్యా సంస్థలు ఉన్నాయి. ఉన్నత ప్రమాణాలతో విద్యను అందిస్తున్న విద్యాలయాలు దేశీయంగానూ ఎంతో ప్రాచుర్యం పొందాయి. పుట్టపర్తిలో రైల్వే స్టేషన్, విమానాశ్రయం కూడా ఉన్నాయి.

పర్యాటకంగానూ పుట్టపర్తి అభివృద్ధి

పుట్టపర్తిని పర్యాటకంగానూ అభివృద్ధి చేసేలా సత్యసాయి సెంట్రల్ ట్రస్టు చర్యలు తీసుకుంది. ఇటీవల పుట్టపర్తిలోని చిత్రావతి నదిలో బోట్ క్లబ్ ఏర్పాటు చేశారు. సత్యసాయి మహాసమాధి దర్శించుకోవడానికి వచ్చే భక్తులు, పర్యాటకులకు ఈ బోటు క్లబ్ ఎంతో ఆహ్లాదకరంగా అలరిస్తోంది. సత్యసాయి సంస్థలు ఏర్పాటు చేసిన హిల్‌వ్యూ స్టేడియం సమీపాన వెలసిన చైతన్య జ్యోతి మ్యూజియం పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. యూనివర్సిటీ వద్ద వెలసిన పురాతన మ్యూజియం సత్యసాయి బాబా జీవిత చరిత్ర గురించి పర్యాటకులకు అర్థమయ్యే విధంగా ఏర్పాటు చేశారు. చిత్రావతి ఒడ్డున వెలసిన పురాతన కల్పవక్షం అలరిస్తోంది. పెద్దపెద్ద నగరాల్లో ఉండే నక్షత్రశాలను పుట్టపర్తిలో ఏర్పాటు చేశారు. బుధవారం, శనివారం ఉచితంగా నక్షత్రశాల తిలకించడానికి ప్రవేశం ఉంటుంది. సత్యసాయి విద్యార్థులు వ్యాయామం చేసుకోవడానికి అనుకూలంగా హిల్ వ్యూ స్టేడియంతో పాటు ఇండోర్ స్టేడియంను నిర్మించారు. ఇక్కడ ప్రతి ఏటా జనవరి 11న సత్యసాయి విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగానే సత్యసాయి జన్మదిన వేడుకలు నవంబర్ 23న వైభవంగా నిర్వహిస్తున్నారు.



పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

విద్యుత్ సబ్ స్టేషన్ పనులు ప్రారంభం

రొద్దం : మండలంలోని దొడగట్ట పంచాయతీలో ఏర్పాటు చేయనున్న విద్యుత్‌సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా దొడగట్ట ఎంపీటీసీ బాలాజీ మాట్లాడుతూ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుతో చుట్టుపక్కల గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజు నాయక్, విఆర్ఎ రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోస్టర్లు విడుదల

మడకశిర : ఎయిడ్స్ వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని ప్రగతి జూనియర్ కళాశాలలో బుధవారం పోస్టర్లు విడుదల చేశారు. కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఆంజనేయులు, కృష్ణమూర్తి, సుమంజలి, జయరామ్, పద్మ, ఫోర్డ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

కదిరి అర్బన్ : మండల పరిధిలోని ఎర్రదొడ్డి పంచాయతీలో వై కొత్తపల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులు విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి లక్ష రూపాయిలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఈశ్వర్ నాయక్, నాయకులు , స్థానికులు పాల్గొన్నారు.

ట్యాక్సీ కార్మికులకు దుస్తులు పంపిణీ

పుట్టపర్తి అర్బన్ : సత్య సాయి బాబా 98వ జన్మదిన వేడుకలు సందర్భంగా ఆటో, టాక్సీ డ్రైవర్లకు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. బుధవారం టిడిపి స్థానిక కార్యాలయంలో పట్టణంలోని 800 వందల మంది ఆటో మరియు టాక్సీ డ్రైవర్లకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ బాబా చేసిన సేవలను స్ఫూర్తిగా తీసుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీరామ్ రెడ్డి, నాయకులు పుల్లప్ప, గూడూరు ఓబులేసు, దయ్యాల ఉమాపతి, అంబులెన్స్ రమేష్, శామీర్, ఆటో యూనియన్ నాయకులు హుస్సేన్‌బాషా, మల్లికార్జున, ఖాదర్ బాషా, కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు

పంటకోత ప్రయోగాలు

బత్తలపల్లి : మండలంలోని సంజీవపురం గ్రామంలో అధికారులు కంది పంట కోత ప్రయోగాలను నిర్వహించారు. ఎఎస్ఒ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ ఆధ్వర్యంలో రైతు లోకేష్ నాయుడు పొలంలో ప్రయోగాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ జిల్లా కోఆర్డినేటర్ చంద్రమోహన్, ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

లేపాక్షి : మండలం కేంద్రంలోని దుర్గా వీరభద్ర స్వామి శాశ్వత హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. 94 రోజులకు గాను రూ. 23, 5818లు వచ్చిందని హుండీ పర్యవేక్షణ అధికారి నాగేంద్రుడు, ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి, ఆలయ అర్చకులు లక్ష్మీనరసింహ శర్మ, సుబ్బరాయుడు, ఆనందప్ప తెలిపారు.

దీపోత్సవం

పుట్టపర్తి రూరల్: సత్యసాయిబాబా 98వ జయంతి సందర్భంగా పుట్టపర్తి లోని సాయిదర్బార్ ఆలయంలో దీపోత్సవాన్ని బుధవారం సత్య సాయి బాబా భక్తులు ఘనంగా నిర్వహించారు. శ్రీ వాణి బ్లొసమ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈ దీపోత్సవాన్ని ఏర్పాటు చేసినట్లు సంస్థ ప్రతినిధి శ్రీవాణి తెలిపారు. ఈ సందర్భంగా సత్యసాయి ఆలయంలో పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీవాణి, శ్రీనివాస్, సౌజన్య, పెద్ద సంఖ్యలో సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

అన్నదానం

హిందూపురం : ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా అయ్యప్ప భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేస్తున్నట్టు చోళ సముద్రం గ్రామానికి చెందిన సమాజ సేవకుడు కరణం రమా నందన్ అన్నారు. బుధవారం ఉదయం హిందూపురంలోని బెంగళూరు రోడ్డు సమీపంలో ఉన్న అయ్యప్ప దేవాలయంలో భక్తులకు భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అన్నదాన కమిటీ అధ్యక్షులు రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని

మున్సిపల్ కార్యాలయం ముట్టడి



మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించిన కాలనీవాసులు

ప్రజాశక్తి మడకశిర

పట్టణంలోని 17వ వార్డుకు సంబంధించిన ఇందిరమ్మ కాలనీలో నెలకొన్న తాగునీరు, డ్రయినేజీ, రోడ్డు సమస్యపై ఆకాలనీ మహిళలు స్థానిక మున్సిపల్ కార్యాలయాన్ని బుధవారం ముట్టడించారు. కాలనీకి చెందిన మహిళలు ఖాళీ బిందెలతో మున్సిపల్ కార్యాలయానికి తాళాలు వేసి దాదాపు రెండు గంటల పాటు బైటాయించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత కొంతకాలంగా తాగునీరు, డ్రయినేజీ సమస్య తీవ్రంగా ఉన్నా అధికారులు, పాలకులు పట్టించుకోలేదని విమర్శించారు. పలుమార్లు ప్రజాప్రతినిధులకు అధికారులకు వినతి పత్రాలు అందించినా పట్టించుకోలేదన్నారు. ఈసదర్భంగా ఎమ్మెల్యే, ఛైర్‌పర్సన్, కమిషనర్, కౌన్సిలర్ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

జాతీయస్థాయి క్రీడాపోటీల్లో గ్రామీణ విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి ధర్మవరం టౌన్



ప్రతిభా విద్యార్థితో వ్యాయామ ఉపాధ్యాయుడు

జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో మండల పరిధిలోని చిగిచెర్ల ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి చదువుతున్న నందిని ప్రతిభ కనపర్చి మెడల్ సాధించిందని హెచ్ఎం తిమ్మారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ ప్రతాప్ రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నందిని నవంబర్ 15నుండి 19వరకు జమ్ములో జరిగిన అండర్ 14 జూడో జాతీయ పాఠశాల క్రీడలలో మైనస్ 27 విభాగంలో రజత పతకం సాధించిందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ జూడో అండర్ 14 బాలబాలికల విభాగంలో జాతీయస్థాయిలో సిల్వర్ మెడల్ సాధించిన నందినిని గ్రామస్తులు, సీనియర్ క్రీడాకారులు, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న చిలమత్తూరు ఎంపిడిఒ

గవర్నర్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి- చిలమత్తూరు

పుట్టపర్తిలో జరుగుతున్న స్నాతకోత్సవానికి హాజరుకావటానికి వస్తున్న ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ కు చిలమత్తూరు మండలం రక్షాఅకాడమి వద్ద స్థానిక ఎంపిడిఒ నరేష్ క్రిష్ణ,తహశీల్దార్ నాగరాజు స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. సుమారు 30 నిమిషాల పాటు రక్షా అకాడమిలో గవర్నర్ విరామం తీసుకున్నారు. అల్పాహారం అనంతరం అక్కడి నుండి పుట్టపర్తికి తరలివెల్లారు. గవర్నర్ రాక నేపథ్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటాం

ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇక్బాల్

ప్రజాశక్తి-హిందూపురం

పార్టీ అధిష్టానం నిర్ణయానికి తాను ఎప్పుడు కట్టుబడి ఉంటామని పార్టీ నిర్ణయమే తనకు శిరోధార్యం అని ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. పుట్టపర్తికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వస్తున్న నేపథ్యంలో ఆమెను స్వాగతం పకడానికి ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ బెంగళూరు విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గన పుట్టపర్తికి వెళ్లారు. గత నాలుగు నెలలుగా హిందూపురానికి ఎమ్మెల్సీ దూరంగా ఉన్నారు. ఎమ్మెల్సీ పుట్టపర్తికి వెళ్తున్న విషయం తెలుసుకున్న హిందూపురం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, చిలమత్తూరు మండల నాయకులు, పలువురు కౌన్సిలర్లతో పాటు నియోజక వర్గ వ్యాప్తంగా ఉన్నా వైసిపి నాయకులు, కార్యకర్తలు వేలాది మంది జాతీయ రహదారి కర్నాటక సరిహద్దులోని బాగేపల్లి టోల్ ప్లాజా వద్ద ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇక్బాల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తమ పార్టీలోని కొంతమంది నాయకులు అభద్రతాభావంతో మాట్లాడుతున్నారని అన్నారు. పార్టీ అధిష్టానం ఎవరికి టికెట్ ఇచ్చినా అందరూ కలిసి పనిచేస్తామన్నారు. తాను పోటీ నుంచి తప్పుకున్నానని...పార్టీ పెద్దలు ఆదేశిస్తే హిందూపురంలో తమ అభ్యర్థి విజయం కోసం ప్రచారం చేస్తానని ఎమ్మెల్సీ అందరి ముందు ప్రకటించారు. అనంతరం విలేకరుల ఎమ్మెల్సీ మాట్లాడుతు అందరం కలిస్తేనే పార్టీ అభివృద్ధి చెందుతుందన్నారు. బెదిరింపులు, ప్రలోభాలతో వచ్చే ఫలితం శాశ్వతం కాదన్నారు. ప్రతి కార్యకర్తను ఆప్యాయంగా పలికరించి, వారికి అండగా ఉంటేనే అందరు నాయకులతో ఉంటారన్నారు. బెదిరింపులు ప్రలోభాలకు పాల్పడితే ప్రతి ఒక్కరూ దూరం అవుతారన్నారు. హిందూపురం నియోజకవర్గానికి తనకు ఒక అనుబంధం ఏర్పడిందని పార్టీ ఆదేశించిన కాలం అంతా ఈ ప్రాంతంలో ప్రజలకు సేవలు అందించానని అన్నారు. అధిష్టాన సూచనల మేరకు ఇక్కడి నుంచి వెళ్లానని చెప్పారు. అందరం కలిసి దీపికను గెలిపించి, ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి బహుమతిగా ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి కంచుకోటను బద్దలు కొట్టడానికి ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. హిందూపురంలో గ్రూపులు లేవని, ఉన్నది ఒక్కటే గ్రూపు అని అది జగనన్న గ్రూపు అని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఇర్షాద్, రహమత్ బీ, ముస్తక్ ఖాన్, నాయకులు షఫి, అల్తాఫ్, కట్ల బాషా, సలీం, శ్రీనివాసులు, రావాణ్‌తో పాటు నియోజక వర్గంలోని పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రతిభ కనపర్చిన యశోద పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో

యశోద పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణంలోని యశోద కాన్సెప్ట్ స్కూలులో 9వ తరగతి చదువుతున్న టీ. వర్షిత, బి. నిహారిక రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో ప్రతిభ కనపర్చారని ప్రిన్సిపల్ అనూప్, డైరెక్టర్ పృథ్వీరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 18వ తేదీ నుండి 20వ తేదీ వరకు ఏలూరులో జరిగిన హ్యాండ్ బాల్ ఇంటర్ డిస్టిక్ కాంపిటీషన్లో వీరు ప్రతిభ కనబరచి మూడవ స్థానాన్ని కైవసం చేసుకున్నారని తెలిపారు. ప్రతిభా విద్యార్థులను డైరెక్టర్, ప్రిన్సిపల్ తో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు అశోక్, పాఠశాల ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీలకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు అండర్ - 14 బాస్కెట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం శైలజ, ఫిజికల్ డైరెక్టర్ నాగేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలకు చెందిన కార్తీక్, నాయక్, రవితేజ అన్నమయ్య జిల్లా అంగళ్లలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన బాస్కెట్‌బాల్ అండర్ 14 బాలుర విభాగంలో ప్రతిభ కనపర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. ప్రతిభా విద్యార్థులను వీరితో పాటు హిందీ టీచర్ వేణుగోపాల్, ఉపాధ్యాయులు రఫీ, తులసి, హేమలత, శ్రీనివాసులు, లలితమ్మ, ప్రసాద్ బాబు, రామకృష్ణారెడ్డి, రామాంజనేయులు తదితరులు అభినందించారు.



ప్రతిభా విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

పుట్టపర్తిలో కర్ఫ్యూ వాతావరణం



నిర్మానుష్యంగా ఉన్న పుట్టపర్తి రహదారి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ అబ్దుల్ నజీర్ సాయిబాబా 98వ జయంతి వేడుకలకు బుధవారం పుట్టపర్తికి వచ్చిన నేపథ్యంలో పోలీసుల భారీ బందోబస్తుతో పుట్టపర్తి వీధులు కర్ఫ్యూను తలపించాయి. బుధవారం మధ్యాహ్నం 3:10 గంటలకు ప్రత్యేక విమానంలో పుట్టపర్తి విమానాశ్రయం చేరుకున్నారు. అక్కడి నుండి రోడ్డు మార్గం ద్వారా ప్రశాంతినిలయంలో ప్రవేశించారు. ఈ సందర్భంగా ఉదయం 8:00 గంటలకే సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్దనుండి ప్రశాంతి నిలయం వరకు 6 కిలోమీటర్ల మేర పోలీసులు దిగ్బంధించారు. ప్రజలు వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎక్కడ చూసినా బారికేట్లు ఏర్పాటు చేశారు. ఎనుములపల్లి, గోకులం, పుట్టపర్తి లోని అనేక రహదారులను బారికేట్ల ద్వారా మూసివేశారు. ప్రశాంతి నిలయానికి వచ్చే ప్రజలు మూడు కిలోమీటర్ల నడిచాల్సి వచ్చింది. రాష్ట్రపతి, గవర్నర్, మంత్రి కాన్వాయిలు వచ్చేటప్పుడు గంటల కొద్ది ప్రజలను, వాహనాలు ఆపేశారు. దీంతో వీధుల్లో కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. ప్రధాన రహదారి అంతా ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్మానుష్యంగా కనిపించింది. అదేవిధంగా బస్సులను రహదారులకు మళ్లించడం వల్ల వేడుకలకు వచ్చే ప్రజలు భక్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సంవత్సరానికి ఒకసారి జన్మదిన వేడుకలు ఎంతో వైభవంగా జరిగే సందర్భంలో చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులు, అదేవిధంగా ఇతర దుకాణ దారులు పుట్టపర్తి వచ్చే భక్తుల ద్వారా మంచి వ్యాపారం జరుగుతుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. రాష్ట్రపతి, గవర్నర్ రాక సందర్భంగా ప్రధాన రహదారులన్నీ మూసివేయడం, వ్యాపార

చిరు వ్యాపారుల నిరాశ

సముదాయాలకు అడ్డంగా బారిగేట్లు ఏర్పాటు చేయడంతో వ్యాపార సంస్థలను మూసివేశారు. వ్యాపారం ద్వారా పది రోజులైనా లబ్ధి పొందవచ్చన్న వారి ఆశలపై నీళ్లు చల్లినట్లైంది. అదేవిధంగా ప్రశాంతి నిలయంలో ఏర్పాటుచేసిన ఉచిత భోజనాలు పెట్టే స్థలానికి కూడా వెళ్లడానికి కూడా వీలు లేకుండా పోయింది. రాష్ట్రపతి కాన్వాయ్ వెంట వందలాది వాహనాలు రోడ్డుమీద రావడంతో వాటిని చూడ్డానికి ప్రజలు ఎగబడ్డారు. అయితే రాష్ట్రపతి కనిపించకపోవడంతో కొంత నిరాశ కలిగిందని ప్రజలు అనుకుంటున్నారు. రెండు రోజులుగా రెండు వేల మంది పోలీసులు పుట్టపర్తిని దిగ్బందించారని ప్రజలు వాపోతున్నారు. సాయిబాబా బ్రతికున్న సమయంలో రాష్ట్రపతులు గాని ప్రధాన మంత్రులు గాని వచ్చినప్పుడు ఇన్ని ఆంక్షలు ఉండేవి కాదని చిరు వ్యాపారులు దుకాణ వ్యాపారులు వారి వారి వ్యాపారాలు సజావుగా జరిగేవని గుర్తుకు చేసుకున్నారు. ఈసారి అలా కాకుండా దుకాణం తెరవడానికి భయపడ్డామని వారు అన్నారు. వ్యాపారాలు సాగకపోవటంతో కరెంట్ చార్జీలు కట్టుకోవడం కష్టమైందని ఆవేదన వ్యక్తం చేశారు.

సినీ ఫక్కీలో చోరీ

రూ. 17 లక్షల నగదు అపహరణ



నగదు దోచుకెళ్లిన అగంతకుడు

కదిరి అర్బన్ : కదిరి పట్టణంలో ప్రధాన స్టేట్ బ్యాంక్ కార్యాలయం ఎదురుగా సినీఫక్కీలో చోరీ జరిగింది. ద్విచక్ర వాహనంలో ఉన్న రూ. 17 లక్షల రూపాయలను దుండగులు దోచుకెళ్లినట్లు బాధితుడు మహమ్మద్ అష్రఫ్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సిఐ నారాయణరెడ్డి, ఎస్ఐ బసయ్య తెలిపిన వివరాలు.. భూమి విక్రయించగా వచ్చిన నగదును మహ్మద్ అష్రఫ్ తన స్కూటీలో పెట్టి స్నేహితులతో మాట్లాడుతుండగా దుండగుడు నగదు దోచుకెళ్లాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ బసయ్య తెలిపారు.

మాజీ జెడ్పీటీసీ మృతి

తలుపుల : తలుపుల మాజీ జడ్పీటీసీ పట్టుపోగుల నారాయణ (75) ఆయన స్వగ్రామం గంజివారిపల్లిలో మృతి చెందాడు. ఈయన సామాజిక ఉద్యమకారుడిగా, పేదల పక్షపాతిగా, వామపక్షవాదిగా ప్రజల పక్షాన నిలబడి ఎంతో మందికి అండగా నిలిచారు. ఆయన అంత్యక్రియలు గంజివారిపల్లిలో నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

హుండీ ఆదాయం లెక్కింపు

కదిరి టౌన్ : ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వివిధ టెండర్లకు హక్కులు పొందడానికి నిర్వహించిన వేలంలో రూ. 32 లక్షలు ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. ఇ-టెండర్, సీల్డ్ టెండర్, బహిరంగవేలంలో నిర్వహించిన ఆ హెచ్చుపాట మొత్తములతో పాటు ప్రభుత్వ పన్నుతో కలిపి వసూలు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ జెరిపిటి గోపాలక్రిష్ణ , కార్యనిర్వహణాధికారి వెండిదండి శ్రీనివాసరెడ్డి, నరసింహరాజు, దేవదాయశాఖ తనిఖీ అధికారి తదితరులు పాల్గొన్నారు.

భూములను ఆక్రమిస్తే అడ్డుకుంటాం

బుక్కపట్నం : మండల పరిధిలోని బుచ్చయ్య గారి పల్లి గ్రామ సర్వే నెంబర్ 1414లోని బసవేశ్వర స్వామి దేవాలయానికి సంబంధించిన ఆక్రమించడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని అలా జరిగితే అడ్డుకుంటామని. బసవేశ్వర స్వామి కమిటీ సభ్యులు తెలిపారు. జెసిబి లతో చదివిన చేసిన స్థలాన్ని పరిశీలించిన వారు మాట్లాడుతూ. 1928 వ సంవత్సరంలో. బసవేశ్వర స్వామి మఠానికి. చెందినట్లుగా భూమి రికార్డులు ఉన్నాయని అయితే ఎవరు గుర్తించకపోవడంతో 20సంవత్సరాలనుండి కంపచెట్ల మొలిచాయని అన్నారు. ముదిగుబ్బ నుంచి కోడూరు వరకు. 342 జాతీయ రహదారి రావడంతో ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. దీంతో ఈ భూమిని కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఆలయ భూములు గుడికి చెందేలా అధికారులు చర్యలు చేపట్టాలని కమిటీ సభ్యులు, గ్రామస్తులు సంజీవ రాయుడు, పెద్దరాజు సుబ్రహ్మణ్యం. నాగభూషణం, కాయగూరల చంద్ర. ఈశ్వరప్ప. సతీష్ కుమార్, చంద్ర,గోపాల్. గుర్రప్ప. సిపిఎం మండల కార్యదర్శి బాళ్లఅంజి. వెంకట రాముడు తదితరులు డిమాండ్ చేశారు.

టిడిపితోనే అభివృద్ధి సాధ్యం

ముదిగుబ్బ : టిడిపితోనే అభివృద్ధి సాధ్యమని టిడిపి నాయకులు అన్నారు. ట్టణం లోని 14, 16 వ వార్డులో బుధవారం బాబ ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మినీ మేనిఫెస్టో లోని సూపర్ - సిక్స్ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి తుమ్మల మనోహర్, గోనుగుంట్ల రామాంజనేయులు నంద శేఖర్ నాయుడు, వేలూరు జయ చంద్ర , కిష్టప్ప, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు అండగా నిలుద్దాం : వైసిపి

ప్రజాశక్తి బత్తలపల్లి


వైసిపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రతి కుటుంబానికి మేలు చేకూర్చుతున్న సిఎం జగనన్నకు అండగా నిలుద్దామని ఎంపిపి బగ్గిరి త్రివేణిరెడ్డి, జెడ్పీటీసీ కోటి సుధ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని డి.చెర్లోపల్లి గ్రామ సచివాలయం వద్ద సర్పంచి అధ్యక్షతన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ప్రదర్శించారు. గ్రామ సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన వైసిపి జెండాను ఆవిష్కరించారు. ఇంటింటికి తిరిగి 2019 లో చంద్రబాబు ఇచ్చిన హామీలు,2019 లో జగన్ ఇచ్చిన హామీలకు ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ రాంభూపాల్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ రామకృష్ణారెడ్డి, చల్లాకృష్ణ, ముసలప్ప, బయప్ప, బండి వీరనారప్ప, వెంకటరెడ్డి, ప్రసాద్ రెడ్డి, సూర్యనారాయణ, కొండారెడ్డి, రమణ నాయక్, నారాయణస్వామి, హరినాథ్ రెడ్డి తదితరులుతో పాటు అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదిత రులు పాల్గొన్నారు.

నేడు దంపెట్లలో వై ఏపీ నీడ్స్ జగన్ : వైసిపి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న వై ఏపీ నీడ్స్ జగనన్న కార్యక్రమం గురువారం దంపెట్ల పంచాయతీలో నిర్వహిస్తున్నట్లు సర్పంచి చల్లా కరుణాకర్ నాయుడు తెలిపారు. దంపెట్ల, గరిశనపల్లి పంచాయతీలకు దంపెట్ల సచివాలయలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు అధికారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కొత్తచెరువు : ప్రజాసంక్షేమమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని కొత్తచెరువు సర్పంచి రాధా నాగరాజు, వైసిపి మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, వైసీపీ నాయకులు వాల్మీకి శంకర్, సచివాలయ కన్వీనర్ సాంబశివారెడ్డి అన్నారు.కొత్తచెరువు లోని నాలుగవ సచివాలయంలో వై నీడ్స్ జగన్ అనే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు రఫీ, లక్ష్మీదేవి, నాయకులు వెంకటరాముడు, సుబ్బారావు, పెయింటర్ కేశవ, రామాంజనేయులు, కృష్ణమూర్తి, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : మండల కేంద్రంలోని స్థానిక నాలుగో సచివాలయంలో వై నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వైసీపీ కన్వీనర్ నారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమేష్ బాబు, ఇఒఆర్‌డి నాగరాజు రావ్ ఈసందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది వైసిపి నాయకులు పాల్గొన్నారు.

హిందూపురం :రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా అర్హులకు సంక్షేమ కార్యక్రమాలు అందించడం ఒక్క సీఎం జగన్ మోహన్ రెడ్డికే సాధ్యమని నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జ్ దీపిక వేణురెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 1వ వార్డులో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్న దీపిక ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, ప్రజలకు అందించిన సంక్షేమ పాలన గురించి ప్రజలకు వివరించారు. ఈకార్యక్రమంలో వైస్ చైర్మేన్ బలరామిరెడ్డి, బి బ్లాక్ కన్వీనర్ నరేష్, జెకెసి కన్వీనర్ శివశంకర్ రెడ్డి, రాష్ట్ర బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు షాజియా, రోషన్ అలీ, లక్ష్మీ మహేష్ గౌడ్, కిరోసిన్ బాబు, కాణిపాకం టెంపుల్ డైరెక్టర్ రవీంద్రుడు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మహేంద్రనాథ్ రెడ్డి, వార్డు ఇన్‌ఛార్జులుకవిత, ఫరూక్, నారాయణ స్వామి, నాయకులు భాను, కదిరిష్, కురుబ భారతి, కవిత రెడ్డి, రామకృష్ణారెడ్డి, రాము, షాజహాన్, మున్సిపల్ ఎఇ వెంకటరమణ, సచివాలయ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాల, అభివృద్ధి కార్యక్రమాల డిస్‌ప్లే బోర్డును ప్రారంభిస్తున్న దీపిక